



డాక్టర్ శశిధర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారన్న వార్త ఆ పట్టణంలో సంచలనాన్ని కలిగించింది.

మంచి హస్తవాసున్న డాక్టరుగా, మానవత్వమున్న వ్యక్తిగా పేరు తెచ్చుకున్న శశిధర్‌ను ఏ కారణం వల్ల అరెస్ట్ చేశారో తెలీక పుకార్లు షికార్లు చేశాయి.

వైద్య వృత్తి పట్ల అతడికున్న అంకితభావం, సేవాదృక్పథం వల్ల అనతి కాలంలోనే అతడు గొప్ప పేరు ప్రఖ్యాతల్ని సంపాదించాడన్నది అక్షర సత్యం.

అతడు పట్టణంలో పుట్టి పెరిగినా తన వైద్య సేవలు పేద ప్రజలకే అవసరమని ఎంచి సిద్దవటం అన్న ఓ కుగ్రామాన్ని ఎంచుకుని, ఆ గ్రామ ప్రజలతో సహజీవనం చేస్తూ వారికి తన సేవలు అందిస్తూ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న విలక్షణుడు ఆయన!

తానూ, తన వృత్తి తప్ప ఇతర విషయాలేవీ పట్టించుకోని పక్షపాతి ఆయన.

అటువంటి వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారని తెలియగానే ముందు రఘుపతి రియాక్ట్ అయ్యాడు.

రఘుపతి - జిల్లా డాక్టర్ల అసోసియేషన్‌కు అధ్యక్షుడు. తమ వాళ్ళకు ఏ చిన్న అసౌకర్యం కలిగినా, హాని జరిగినా పెద్దగా చలించిపోయే మనస్తత్వం ఆయనది.

అందుకే ఈ సంఘటన ఓ వ్యక్తికి జరిగిన అవమానంగా కాక, ఎంతో గౌరవ ప్రతిష్టలు కల్గిన తమ వృత్తిపై పడ్డ కళంకంగా దాన్ని పరిగణించాడు.

అంతే! హుటాహుటిగా రఘుపతి డా॥ శశిధర్ ఇంటికి వెళ్ళి అతడి కుటుంబ సభ్యుల్ని పరామర్శించాడు. వారికి ధైర్యాన్ని ఇచ్చాడు. తమ అసోసియేషన్ శశిధర్‌ను విడుదల చేయించటానికి పూర్తి స్థాయిలో పోరాడుతుందని హామీ ఇచ్చాడు.

అప్పుడప్పుడూ తమ కొలీగ్స్ చేసే కొన్ని

పొరబాట్లవల్ల రోగికి సైడ్ - ఎఫెక్ట్స్ రావటమో, కొన్ని సందర్భాల్లో రోగి చనిపోవటమో జరుగుతుంటుంది. అటువంటి సందర్భంలోనూ లేదూ - ఇతర వ్యక్తిగత బలహీనత వల్ల ఏ కక్కుర్తికో పాల్పడిన సందర్భాలలో డాక్టర్లు ఇలా అరెస్టులు కావటం సహజమే!

కానీ, డాక్టర్ శశిధర్ విషయంలో అటువంటిది జరగటానికి వీల్లేదు. మరెందుకు శశిధర్ అరెస్ట్ అయినట్టు?!

ఇదేదో అర్థంగాని వ్యవహారంగా అనిపించింది రఘుపతికి! శశిధర్‌ను కావాలని పోలీసు కేసులో ఇరికించినట్టుగా అతడు అనుమానించాడు.

వెంటనే అతడు జిల్లా పోలీస్ కార్యాలయానికి వెళ్ళాడు.

ఎస్పీని కలుసుకుని తనను తాను పరిచయం చేసుకుని డా॥ శశిధర్‌ను కలుసుకోవటానికి అనుమతి నివ్వవలసిందిగా కోరాడు. అయితే అందుకు ఎస్పీ తిరస్కరించాడు.

దాంతో పట్టరాని ఆగ్రహం కలిగింది రఘుపతికి.

"పోనీ, డా॥ శశిధర్‌ను ఏ కారణం చేత అరెస్ట్ చేశారో నేను తెలుసుకోవచ్చా?" ఎస్పీని సూటిగా ప్రశ్నించాడు రఘుపతి.

"ఒక తీవ్రవాదికి ఆశ్రయం కల్పించాడన్న నేరం పై అతణ్ణి కస్టడీలోకి తీసుకున్నాం...." చెప్పాడు ఎస్పీ.

"తీవ్రవాదికి ఆశ్రయం కల్పించినందుకా లేక అతడికి వైద్యం చేసినందుకా?"

"రెండూనూ...."

"యూ ఆర్ మిస్టేకన్ ఎస్పీగారూ.... పొరబాటు పడో లేక తప్పుడు సమాచారం అందో మీరు డా॥ శశిధర్‌ను అరెస్ట్ చేశారేమోనని నేను అనుకుంటున్నాను."

"నో మిస్టర్ రఘుపతి! ఇవ్వాళ ఉదయం ఓ తీవ్రవాదికీ మాకూ జరిగిన ఎన్‌కౌంటర్లో అతడికి బుల్లెట్ గాయం కావటంతో మా నుండి తప్పించుకుని పారిపోయి ఎక్కడో తలదాచుకున్నాడు. మేము అతడి కోసం ఈ చుట్టు ప్రక్కల గ్రామాలన్నీ గాలిస్తున్నప్పుడు డా॥ శశిధర్ ఆ తీవ్రవాదికి వైద్యం చేశాడన్న సమాచారం మాకు అందింది. వెంటనే మేం డా॥ శశిధర్‌ను అదుపులోకి తీసుకున్నాం....."

"డాక్టర్ శశిధర్ ఆ తీవ్రవాదికి వైద్యం చేస్తుండగా మీరైతే ప్రత్యక్షంగా చూళ్ళేదు కదూ ఎస్పీ గారూ.....?"

"మా వాళ్ళూ ప్రత్యక్షంగా చూళ్ళేదు! కానీ.... ఆ తీవ్రవాది ఫొటోను డా॥ శశిధర్‌కు చూపించినపుడు, తాను అతడికి వైద్యం చేసినట్టు సాక్షాత్తూ మీ డాక్టరే అంగీకరించారు. ఇక అంతకు మించి సాక్ష్యం మాకేం కావాలి?...." కనుబొమలు ఎగరేసి తల వూపుతూ అన్నాడు ఎస్పీ.

"మీరు చెప్పేంత వరకూ అతడొక తీవ్రవాదని డా॥ శశిధర్‌కు తెలియదు కదు ఎస్పీగారూ....?"

"ఒకే..... అలాగే అనుకుందాం! అతడొక తీవ్రవాదన్న విషయాన్ని ప్రక్కన పెడదాం! రోగి గాయం చూసినపుడైనా అది బుల్లెట్ గాయమని డాక్టరుకు స్ఫురించి వుండాలి కదా?! అలా అతడు గుర్తించిన వెంటనే దాన్ని - 'మెడికో లీగల్ కేసు'గా పరిగణించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి! కానీ.... డా॥ శశిధర్ అలా చేయలేదు.... అంటే డా॥ శశిధర్ ఆ తీవ్రవాదిని పోలీసులకు పట్టివ్వకూడదన్న కారణంగానే, ఉద్దేశ పూర్వకంగానే మాకు సమాచారం అందించలేదని స్పష్టమవుతోంది కదా?!..." ఎస్పీ మాటలకు రఘుపతి అడ్డు పడుతూ -

"ఒక్క విషయం ఎస్పీగారూ.... గాయం నిర్దిష్టంగా బుల్లెట్ వల్లే అయిందన్న నిర్ధారణకు రావటం అందరు డాక్టర్లకు సాధ్యం కాదు. దానికి చాలా అనుభవం కావాలి! ముఖ్యంగా ఎక్కడో మారు మూల పల్లెల్లో వైద్యం చేసే డాక్టర్లకు తరచూ బుల్లెట్లు తగిలిన వ్యక్తులు వైద్యం కోసం వచ్చే అవకాశాలు ఎంతవరకూ వుంటాయో మీరే ఆలోచించండి?"

"ఇందులో ఆలోచించటానికేముంది? ప్రతి డాక్టరూ వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడు - 'ఫోరెన్సిక్ మెడిసిన్' అన్న పాఠ్యాంశంలో చట్టపరమైన - 'మెడికో లీగల్ కేసు'లను గుర్తించటం, పోల్చుకోవటం వంటి విషయాలను గురించి బోధిస్తారుగా! మరి దాన్ని ప్రస్తుతం మీ డాక్టరుగారు మర్చిపోయారని అనుకోవాలా?" వ్యంగ్యంగా అన్నాడు ఎస్పీ.

"నిజమే ఎస్పీగారూ.... ఆ విషయాలన్నీ బోధించడం వాస్తవమే! కానీ అవన్నీ సూత్రప్రాయంగానే చెబుతారు కానీ.... ప్రాక్టికల్‌గా మాత్రం కాదు! ఏ రోగి అయినా తానుగా అసలు విషయాన్ని చెబితేనేగానీ డాక్టరుకు అది బుల్లెట్ గాయమని తెలిసే అవకాశం లేదు.... ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే డాక్టర్లు కొంతవరకూ బుల్లెట్ గాయాలను గుర్తించగలరేమోగానీ ప్రైవేట్ ప్రాక్టీస్ చేసే డాక్టర్లు దాన్ని గుర్తించడం కష్టం....."

"ఎంత హాస్యాస్పదంగా వుందో చూడండి మీ వ్యవహారాలు? ఇక ఈ ఆర్గ్యుమెంట్లన్నీ నాకనవసరం. డా॥ శశిధర్ ఆ తీవ్రవాది సమాచారం మాకు అందించకపోవడమన్నది నేరం! అందుకే అతణ్ణి అరెస్ట్ చేశాం! మీరింకేమైనా చెప్పదలచుకుంటే కోర్టులో చెప్పుకోండి!! డాక్టర్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదు...." ఎస్పీ- ఖచ్చితంగా చెప్పేసరికి ఇక అతడితో మాట్లాడ్డం వృధా అనిపించింది రఘుపతికి.

వెంటనే అక్కణ్ణించి బయటపడి తమతోటి డాక్టర్లనంతా అత్యవసర సమావేశపరచి అసోసియేషన్ పరంగా చేపట్టవలసిన అన్ని చర్యలనూ తీసుకున్నాడు - రఘుపతి.


దాంతో రాష్ట్ర వ్యాప్తంగా డా॥ శశిధర్ విడుదల కోరుతూ డాక్టర్లు సమ్మెకు దిగారు. క్రమంగా పికెటింగ్‌లు, ఘెరావ్‌లు, రాస్తారోకోలు బంద్‌లు ఒకటేమిటీ అన్ని రకాల ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు ఊపందుకున్నాయి. రోజూ దిన పత్రికల్లో ఈ విషయం గురించి విస్తృతంగా వార్తలు రాసాగాయి.

ఆ రోజు - డా॥ శశిధర్ కేసు కోర్టుకు వచ్చింది.

జడ్జి - డా॥ శశిధర్‌ను ఒకే ఒక ప్రశ్న వేశాడు.

"అతడు తీవ్రవాదని, అతడికి ఏర్పడ్డ గాయం బుల్లెట్ వల్ల అయిందని నిజంగా..... నీకు తెలియదా?....."

"యువరానర్, నా దగ్గరకు ట్రీట్‌మెంట్ కోసం వచ్చింది తీవ్రవాదో కాడో నాకు తెలియదు. అతణ్ణి



అంతకు ముందు ఎప్పుడూ చూసినట్టు కూడా గుర్తు లేదు. అతడొక సాధారణ వ్యక్తిగానే నాకగుపించాడు. నొప్పికి విలవిల్లాడుతుంటే గాయం ఎలా అయిందని ప్రశ్నించాను. అతను అడవిలో పుల్లలు కొడుతుండగా మొనదేలిన కట్టె ఒకటి ప్రమాదవశాత్తూ గుచ్చుకున్నట్టు తెలపటంతో మరే అనుమానాలూ నాలో కలగలేదు. వెంటనే అతడికి వైద్యం చేశాను. అంతకు మించి నాకింకేమీ తెలియదు యువరానర్!....." సిన్సియర్‌గా బదులిచ్చాడు డా॥ శశిధర్.

జడ్జి అతడి మాటల్లోని నిజాయితీని గుర్తించి మౌనంగా తల ఊపాడు. తీర్పు మరుసటి రోజుకు వాయిదా వేశాడు.

ఆ రాత్రి....

సిద్దవటం గ్రామస్థులందరూ ఆ ఊరి దేవాలయంలో సమావేశమయ్యారు.

గ్రామ పెద్ద గొంతు సవరించుకున్నాడు.

"గా దేముడెట్టుంటడో మనకెవరికీ తెల్వదు. కానీ డాకటరంటే మనకెరికే! అట్టాంటి డాకటరు బాబు తప్పు సేసిండని కోర్టోళ్ళు సిచ్చ ఎయ్య బోతున్నారు.... ఏ పాపమూ ఎరగని డాకటరు సిచ్చను అనుభవించడం అన్యాయం!! గా డాకటర్‌ని ఇడిపించీనికి గిప్పటికే ఎన్నో స్ట్రైకులు, బంద్‌లు సేసింద్రు.... గానీ మన పెబుత్వం ఆయన్ను ఇడిసిపెట్టలే!! డాకటర్‌కు సిచ్చ ఏశారంటే రేపు గాల మనల్ని చూసే దిక్కెవలు? ఆయన లేకుండా మనం బతకటం ఉత్తిమాటే! గందుకని మనమందరం...."

గ్రామ పెద్ద మాటల్ని వింటున్న అయిలయ్య ఉలిక్కిపడ్డాడు.


మరుసటి రోజు.....

సిద్దవటం గ్రామస్థులందరూ కోర్టుకు హాజరయ్యారు.

జడ్జి తన తీర్పును ఇవ్వడానికి ఉపక్రమించాడు.

"కేసు పూర్వాపరాలను పరిశీలించిన మీదట డా॥ శశిధర్‌ను దోషిగా పరిగణించి...."


"ఆగండి దొరా.... ఆగండి...." అన్న అరుపు ఆ కోర్టు హాల్లో గట్టిగా ప్రతిధ్వనించింది.



**యూత్** హీరోలు సల్మాన్, ఫర్దీన్ ఖాన్‌లు ఇద్దరూ ఊహించని విధంగా కేసుల్లో ఇరుక్కున్నారు. ఒకరు గ్లామర్ హీరో మరొకరు గ్రామర్ హీరో అయితే! జీవితంలో నేరస్థుడిగా ముద్ర వేసుకోవడం ఎవరికైనా బాధాకరమే కదా ! వారి స్పందన ఏమిటో చూడండి.

**సల్మాన్ ఖాన్** : భారత శిక్షా స్మృతి చాలా చైల్డిష్‌గా వుంటుంది. దొరికితేనే దొంగ. శిక్షల్లో రాయితీలు, విచారణలో రాయితీలు, న్యాయం ఎప్పుడు ఒక పక్కనే, స్థిరంగా వుంటుంది. డోలాయ మానంగా వుండదు.

**ఫర్దీన్ ఖాన్** : అసలు నేరం అంటే ఏమిటి ? ఇండియాలో నేరస్థులు ఎవరు ?. వీరందర్నీ ఏరిపారేస్తే ... ఎంతమంది మిగుల్తారు ? అవి నిరోధించడం తప్పని నేనన్ను, కాని ఎవరో గాడ్ ఫాదర్ సలహా మేరకు దౌర్జన్యంగా దండయాత్ర సాగించడం నేరం.



"దొరా.... అడ్డుపడుతున్నందుకు నన్ను క్షమించండి. వంద మంది దోషులు తప్పించుకోవచ్చు గానీ ఒక నిర్దోషికి శిక్ష పడకూడదన్న సూత్రం పైన న్యాయ వ్యవస్థ ముందుకు సాగుతోంది. కానీ, నేడు అది గాడి తప్పేట్టుంది....." గుంపులో నుండి అయిలయ్య ముందుకు వచ్చాడు.

వెంటనే పోలీసులు అతణ్ణి చుట్టిముట్టి అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు.

జడ్జి వాళ్ళను వారించి -

"నువ్వు ఏమైనా చెప్పదలచుకుంటే ఆ బోనులో కొచ్చి చెప్పు...." అన్నాడు అయిలయ్యతో.

"దున్నే వాడిదే భూమి - అన్న లక్ష్యంతో భూకామందుల పనిపట్టి - సమ సమాజ స్థాపన కోసం తుపాకీ పట్టిన నన్ను ఏ ప్రభుత్వమైతే తీవ్ర వాదిగా ముద్ర వేసిందో, అదే ప్రభుత్వం ఒక డాక్టరు తన వృత్తి ధర్మంతో నాకు వైద్యం చేసినందుకు అతణ్ణి కూడా దోషిగా పరిగణించింది. దొరకని దోషిని వదిలిపెట్టి దొరికిన అమాయకుణ్ణి శిక్షించడం ఏమేరకు న్యాయం?.... తుపాకీ చేత పట్టిన నేను నా ప్రజల క్షేమాన్ని కాంక్షించాను. వారి ఆనందాన్ని ఆశించాను.... అందుకోసమే నా జీవితాన్ని నియంత్రించుకున్నాను కూడా....! కానీ నా సేవా ఫలితాలకన్నా ఆ డాక్టరు సేవాఫలాలే వాళ్ళకు తియ్యదనాన్ని ఇస్తోందన్న విషయాన్ని నిన్ననే గ్రహించాను.... ఆ డాక్టరు కోసం వాళ్ళు తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి సిద్దపడ్డారంటే - వాళ్ళ హృదయాలలో ఆయనెంతగా స్థిరపడి పోయారో అర్థం చేసుకున్నాను. వాళ్ళ మనస్సు అద్దంలో నన్ను గాక ఆ డాక్టర్ రూపాన్ని దర్శించుకున్నాను. అందుకే చెబుతున్నాను దొరా.... ఆ డాక్టర్‌కు వ్యతిరేకంగా మీరు ఏ మాత్రం తీర్పు ఇచ్చినా ఆ గ్రామస్థులందరూ ఇప్పుడే, ఇక్కడే సామూహికంగా ఆత్మహత్యలు చేసుకోవడానికి సిద్దంగా వున్నారు...."

అతడి మాటలకు ఆ గ్రామస్థుల పిడికిళ్ళు బిగుసుకున్నాయి. ఆ పిడికిళ్ళలో వడిశాకు ముద్దలు నలిగిపోతున్నాయి.

"...ఎవరికోసమైతే నేను తీవ్రవాదిగా మారానో వాళ్ళు మరో వ్యక్తి కోసం చావుకు సిద్దపడ్డారంటే ఇక నేను వాళ్ళకు ఉపయోగపడని వ్యక్తిగా తలమరుగై వుండటంలో అర్థం లేదు..... అందుకే దొరా నాకుగా నేనై వచ్చి మీ ముందు లొంగిపోతున్నాను.... మీ దృష్టిలో నేను దోషిని, నాకు శిక్ష వేయండి! డాక్టర్‌ను విడిచిపెట్టండి....." అంటూ తన రెండు చేతుల్నీ ముందుకు చాచాడు తీవ్రవాది అయిలయ్య. ✻